
అతను
మధుబాబు

# అతను

రచన

మధుబాబు

*© Author*

*© Madhu Baabu*

*This digital book is published by -*

*కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.*

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# అతను

గుండెలు ఝల్లుమనే వేగంతో వచ్చి, సడన్ బ్రేకుతో తాంతియానగర్ మధ్యలో ఆగింది ఆ పోలీస్ వ్యాన్.

పొడుగాటి లాఠీలు పట్టుకుని, పుట్టలోనుంచి వెలువడుతున్న చీమలమాదిరి స్పీడ్‌గా బయటికి దూకారు పాతికమంది కానిస్టేబిల్స్.

పేద ప్రజలు నివసించే ప్రదేశం ఆ తాంతియా నగర్. రెక్కాడితే గాని డొక్కాడని బడుగుజీవులు మాత్రమే కనిపించే మఫ్సల్ ఏరియా.

తూర్పుదిక్కు తెల్లబడకముందే మిడతలదండులా వచ్చిపడిన ఆ కానిస్టేబిల్స్‌ని చూసి ఖంగారుపడిపోయారు అక్కడ వారందరూ.

"ఏమయింది సాబ్? ఎందుకు వస్తున్నారు సాబ్? ఎవరు కావాలి సాబ్?" వణుకుతున్న కంఠంతో వినయాతివినయంగా ఒక కానిస్టేబిల్‌ని అడిగాడు అప్పుడే తన కాకాహోటల్‌ని తెరిచి, చాయ్ తయారుచేసే ప్రయత్నంలో నిమగ్నమై వున్న యాదగిరి.

"నోరుమూసుకుని నీ పనేదో నువ్వు చేసుకోరా బేవకూఫ్... నోరెత్తావంటే నాలుక చీరేస్తాను" కర్కోటకుడి మాదిరి గయ్‌మని అరిచి, కాకాహోటల్ వెనుకభాగంలో నిట్టనిలువుగా పెరిగివున్న ఒక గంగరావిచెట్టు వెనుక కాపలా కాశాడు ఆ కానిస్టేబిల్.

చిన్నబోయిన ముఖంతో చటుక్కున అవతలికి జరిగాడు యాదగిరి. గబగబా తలవంచుకుని తన పనిలో తాను బిజీ అయిపోతుండగా, ఠీవిగా అడుగులువేస్తూ అక్కడకు వచ్చాడు ఇన్స్‌పెక్టర్ సాబ్.

"చాయ్ ఇవ్వు... దొరగారికి వెంటనే మంచి స్ట్రాంగ్ చాయ్ చేసివ్వు..." ఆయన వెనుకనుంచి యాదగిరిని హెచ్చరించాడు మరో కానిస్టేబిల్.

అధికం అయిపోయింది యాదగిరి మనసులో అడుగుపెట్టిన ఆందోళన. చలి అధికం అయిపోయినట్టు వణుకుతున్న చేతులతో క్షణాలమీద రెడీ చేశాడు వేడి వేడి చాయ్‌ని. శుభ్రంగా తోమివున్న ఒక కప్పులో పోసి ఇన్స్పెక్టర్ సాబ్ చేతికి అందించాడు.

"ఎంతకాలం నించి ఈ హోటల్ బడ్డీని నడుపుతున్నావ్?" చాయ్‌ని నెమ్మదిగా సిప్ చేస్తూ హుందాగా అడిగాడు ఇన్స్పెక్టర్ దొర యాదగిరిని.

"ప... పదేళ్ళనించీ నడుపుతున్నాను సాబ్... రేపు రెండో తారీకుకి సరిగ్గా పది నిండి పదకొండు వస్తాయి..." చేతులు కట్టుకుని సమాధానమిచ్చాడు.

"వాడు ఆ జగజీత్ గాడు ఇక్కడికి వస్తూంటాడా?" చేతిలో వున్న కప్పుమీదినించి దృష్టిని మరలించకుండానే, చాలా క్యాజువల్‌గా అడిగాడు ఇన్స్పెక్టర్.

"జగజీతా? ఎవరు? మా పహిల్వాన్ జగజీతేనా? తను ఇక్కడికి రాకుండా ఇంకెక్కడికి పోతాడు సాబ్? ఉదయం రెండుసార్లు, సాయంత్రం నాలుగుసార్లు వచ్చి చాయ్ తాగందే తనకి ఏమీ తోచదు సాబ్..." సంతోషంగా చెపుతూ సడన్‌గా మాటల్ని ఆపేశాడు.

పనికట్టుకుని పోలీసులు ఎవరిపేరునైనా పలకడం అంటూ జరిగితే, ఆ పేరున్న మనిషి పని అక్కడితో ఖతం అయిపోయినట్టే అంటారు అందరూ.

గొంతుకు ఏదో గులకరాయి అడ్డుపడిన సెన్సేషన్ వెంటనే కలిగింది యాదగిరికి. "ఎందుకు సార్ అడుగుతున్నారు? వాడు ఏం చేశాడు సార్?" చిన్న కంఠంతో వినయాతివినయంగా అడిగాడు ఇన్స్పెక్టర్ ని.

"వాడు మామూలోడు కాదు. పెద్ద చోర్ బద్మాష్... దామా నగర్లో సేట్సిమ్రాన్ దగ్గిర పదిలక్షలు దొంగతనం చేశాడు. వాణ్ణి వదిలిపెట్టం" ఖాళీ అయిన కప్పును పక్కన పెడుతూ అన్నాడు ఇన్స్పెక్టర్ దొర.

తన తల గిర్రున తిరిగిపోతున్నట్టు అనిపించింది యాదగిరికి. "సాబ్... మీకు ఎవరో చాలా తప్పుగా చెప్పారు. మా జగజీత్ అట్టాంటోడు కాదు. ఎప్పుడో చాలా చిన్నగా వున్నప్పుడు తను చిల్లర దొంగతనాలు చేసినమాట నిజమే. అయితే అందుకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడు. జైల్లోనుంచి బయటికి వచ్చిన తర్వాత అప్పటినించీ ఇప్పటివరకూ అట్టాంటి పనులేవీ చేయడంలేదు. మోండా మార్కెట్లో మూటలు మోసి బతుకుతున్నాడు" తడబడుతున్న కంఠంతో నచ్చచెప్పడానికి చాలా ప్రయత్నం చేశాడు.

"అరే బేవకూఫ్... ఒకసారి చోర్ బద్మాష్ అయినవాడు ఎప్పుడూ చోర్ బద్మాష్ కిందే లెక్క. కుక్కతోక సాపుగా ఎప్పుడూ వుండదు. వంకర గానే వుంటుంది" అంటూ బడ్డీ బయటికి పోయాడు ఇన్స్పెక్టర్ దొర.

"అదికాదు సాబ్... మీరు కావాలంటే ఈ అడ్డాలో వున్నవాళ్ళ నెవరినైనా అడగండి. మంచివాడు మా జగజీత్. వాడు అట్టాంటోడు కాదు సాబ్" అంటూ అతని వెనుకే తనూ బడ్డీ బయటికి పోబోయాడు యాదగిరి. అంతలోనే చాయ్ బడ్డీ వెనుకభాగంలో వున్న గుడిసెలమధ్య చెలరేగింది దారుణమైన గందరగోళం.

"పారిపోతున్నాడు.... చోర్ బద్మాష్ పారిపోతున్నాడు. పట్టుకోండి" అని గావుకేకలు పెడుతూ తిరిగి రోడ్డుమీదికి పరిగెత్తుకువచ్చారు లోపలికి పోయిన కానిస్టేబిల్స్‌లో కొంతమంది.

"ఇడుగో....ఇడుగో....ఇడుగిడుగో" అని అరిచాడు బడ్డీ వెనుక గంగరావి చెట్టు చాటున మాటువేసి వున్న కానిస్టేబిల్. పెద్దపులుల మంద మాదిరి అటుకేసి తిరిగారు అందరూ. లాఠీను గాలిలోకి ఎత్తి ఘొల్లున అరుస్తూ ముందుకు దూకబోతుండగా, రాకెట్ మాదిరి వారి మధ్యలోకి దూరింది ఒక పర్సనాలిటీ. కన్నుమూసి కన్ను తెరిచేటంతలో రోడ్డును క్రాస్ చేసి ఆవలివైపున వున్న కట్టడం మధ్యకు వెళ్ళి మాయమైపోయింది.

"పోయాడు... పారిపోయాడు... ఇంతమందిమి ఇక్కడ వుండగా అందరినీ వెర్రోళ్ళను చేసి వెళ్ళిపోయాడు..." కచ్చిగా అంటూ తన బూటుకాలితో నేలను కోపంగా బలంగా తన్నాడు ఇన్స్‌పెక్టర్ దొర.

"వాడు వట్టి జలగలా వున్నాడు సాబ్. వాడి గుడిసె చుట్టూ నిలబడ్డాం. తలుపు పగలగొట్టి లోపలికి పోకముందే మమ్మల్ని ఏమార్చాడు. వాడు వట్టి లఫూట్... బద్మాష్" తాము పడిన కష్టాన్ని వివరించి చెప్పబోయి, అకస్మాత్తుగా ఆగిపోయాడు ఒక కానిస్టేబిల్.

చేతికి దొరికినట్టే దొరికి చిటికెలో చేజారిపోయిన ఆ దొంగ రాస్కెల్ జగజీత్‌ని తలుచుకుని ఆ క్షణంలో పళ్ళు పటపటలాడిస్తూ వుండవలసిన ఇన్స్‌పెక్టర్ దొర, అట్లాంటి పని ఏదీ చేయడంలేదు.

"ఎక్కడికి పోతాడు? ఈ సాయంత్రం లోపల మన చేతికి చిక్కి తీరతాడు..." అంటూ తన వెనుక పక్కన నిలబడివున్న ఇంకో కానిస్టేబిల్ వైపు చూశాడు.

"తీసుకురండి... ఈ హోటల్లో వున్న బద్మాష్‌ని తీసుకువచ్చి వ్యాన్ ఎక్కించండి. వీడికి, ఆ జగజీత్ గాడికి దోస్తీ... వీడిని రెండు ఉతికితే, వాడు ఎక్కడ దాక్కునేదీ మనకి తెలిసిపోతుంది. తీసుకురండి హోటల్ బద్మాష్‌ని..." అని ఆర్డర్ ఇచ్చాడు అతను.

నోరు తెరుచుకుని చూస్తున్నాడు యాదగిరి. ఇన్స్‌పెక్టర్ సాబ్ ఇచ్చిన ఆర్డర్‌ని వినేసరికి కాళ్ళకింద వున్న భూమి కంపిస్తున్నట్లు అనిపించి, చాయ్ కౌంటర్‌ని ఆనుకున్నాడు, కిందపడిపోతానన్న భయంతో.

"రారా...స్టేషన్‌కి పోదాంరా..." అంటూ యాదగిరి షర్టును ఒడిసి పట్టుకున్నాడు రెండు అంగల్లో అతని దగ్గిరికి వచ్చిన కానిస్టేబిల్.

"సాబ్... ఇది అన్యాయం. నాకేమీ తెలియదు. నన్ను స్టేషన్‌కి తీసుకుపోవడం అన్యాయం సాబ్..." చేతులు జోడించి ఖంగారుగా వేడుకున్నాడు యాదగిరి.

"అన్యాయం గిన్యాయం అన్నీ స్టేషన్లో తేలతాయి. వచ్చి వ్యానెక్కు బే... రా..." కర్కశంగా అంటూ అతన్ని బలవంతంగా లాక్కుపోయి వ్యాన్ లోకి నెట్టాడు ఆ కానిస్టేబిల్. పొగలు విడుస్తూ కదిలింది వ్యాన్.

గుడిసెల మధ్యకి పోయిన కానిస్టేబిల్స్ అందరూ వచ్చి ఎక్కగానే, వేగంగా ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టింది.

# 2

అలసిపోయిన పాదాల్ని అతిప్రయత్నంమీద కదిలిస్తూ ఉదయం ఎనిమిది గంటల సమయంలో బీబీచౌక్ ని చేరుకున్నాడు జగజీత్. వేగంగా వచ్చి అతనిముందు ఆగింది ఒక ఆటో...

"అరే జగజీత్ భాయ్... నువ్వు ఇక్కడ వున్నావా?" అంటూ స్టీరింగ్‌ని వదిలి కిందికి దిగాడు డ్రయివర్.

"ఏంటి బే? ఏమయింది??" అతని ముఖంలోకి అనుమానంగా చూస్తూ అడిగాడు జగజీత్.

"ఏమవకూడదో అదే అయింది. నువ్వు పోలీసులకు దొరక్కుండా పారిపోయివచ్చావ్. వాళ్ళు మన యాదగిరిని పట్టుకుపోయారు. స్టేషన్లో పడేసి మక్కెలు విరగేస్తున్నారంట..." గొంతు తగ్గించి చెప్పాడతను.

"యాదగిరిని పట్టుకుపోయారా? యాదగిరిని ఎందుకు పట్టుకుపోవడం?" ఆశ్చర్యంగా అడిగాడు జగజీత్.

"ఆడు నీ దోస్తని ఆళ్ళకు తెల్సిపోయింది. ఆడిని ఇరగేస్తే నువ్వు బైటికొచ్చేస్తావని అర్థమైవుంటుంది" అని చెప్పి, ఎంత సడన్‌గా వచ్చాడో, అంతే సడన్‌గా ఆటోని నడుపుకుంటూ వెళ్ళిపోయాడు.

వేపాకు నమిలినట్టు చేదుగా తయారైపోయింది జగజీత్ నోరు... ముఖంమీది చెమట బిందువుల్ని షర్టు భుజానికి అద్దుకుంటూ నడక మొదలుపెట్టాడతను.

రెండు గంటలు పట్టింది అతనికి సిటీ కాలేజీ దగ్గరికి చేరుకోవడానికి.

కాలేజీ గేటును దాటి లోపలికి పోయాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=938**

* * *

**Read other books of Mr. Madhubabu @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=20**